బాధ్యతలకు నిలబడు! 

**A P T F**

స్థాపితం : 1947
రిజిస్టర్డ్ నెం. 257
రికగ్నిషన్ జీ.వో. నెం.167

హక్కులకై కలబడు!!

సింగరాజు భవన్, 29-7-22, సూర్యారావుపేట, విజయవాడ-2, ఫోన్: 2433505
చెన్నుపాటి లక్ష్మయ్య భవన్, 5-9-839, గన్‌ఫౌండ్రీ, హైదరాబాద్-1, ఫోన్: 23232616

అధ్యక్షులు :
యన్. రఘురామిరెడ్డి
M.A.,B.Ed.,
Cell : 94904 81577

ప్రధానకార్యదర్శి :
పి. పాండురంగవరప్రసాదరావు
B.Sc.,B.Ed.,
Cell : 94408 83829

## ఉపాధ్యాయుల అపరిష్కృత మరియు తక్షణ సమస్యల పరిష్కారంకోసం

# హైదరాబాద్‌లో నవంబర్ 20న ఏ.పి.టి.యఫ్ ధర్నా!

## ఉపాధ్యాయులు విరివిగా ధర్నాలో పాల్గొని జయప్రదంచేయండి!!

*ఉపాధ్యాయ మిత్రులారా!*

రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పాలకులు పరిష్కరించక అపరిష్కృతంగా ఉంచుతున్నారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సాచివేతధోరణిని ప్రదర్శిస్తున్నది. సమ్మెల విషయంలో గతంలో జారీచేసిన 177 జి.ఓ రద్దుకు మాత్రం ససేమిరా అంటున్నది. ఈ జిఓ కారణంగా సమ్మెచేసిన ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలో జాప్యం జరుగుచున్నది. సకలజనుల సమ్మెలో పరిష్కరించిన విధంగా పరిష్కరిస్తామని హామీనిచ్చికూడా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. కొన్ని సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి హామీలిచ్చినా అవి అమలుకు నోచుకోవడంలేదు. అధికారగణం జి.ఓలకు వక్ర భాష్యాలు చెబుతూ మరికొన్ని కొత్త సమస్యలను సృష్టిస్తూ ఉన్నది. అర్ధ జీతపుసెలవును నగదుగా మార్చుకొనే అవకాశం పంచాయితీరాజ్, మునిసిపల్ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు లేదంటూ విద్యాశాఖవారు విచిత్రమైన వివరణ ఇచ్చారు. ఈ విషయమై ఉన్నతాధికారులను సంప్రదించగా పంచాయితీరాజ్ ఉపాధ్యాయులు విద్యాశాఖలో ఉన్నారా? పంచాయితీరాజ్‌శాఖలో ఉన్నారా? అనే సందేహాన్ని వ్యక్తంచేస్తున్నారు. 1998 నుంచి జిల్లాపరిషత్, మండలపరిషత్ సర్వీసు వ్యవహారాలు విద్యాశాఖ నిర్వహణలో నడుస్తూ ఉండగా క్రొత్త అనుమానాలు పుట్టుకొస్తున్నాయి.

నెలకు రు. 398/- వేతనంపై పెట్టి చాకిరీ చేసినవారి పీరియడ్‌కు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు, 1/2005, 37/2005 చట్టాలు ప్రాస్పెక్టివ్‌గా అమలు మొదలైన అంశాలపై ఆర్థికశాఖ అధికారులు అసంబద్ధమైన వివరణలు ఇచ్చి, విద్యాశాఖ అధికారులను, తప్పుదోవ పట్టిస్తూ పరిష్కారంచేయక జాప్యం చేస్తున్నారు. ఈ క్రింది సమస్యలపై గతంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పక్షాన, జాక్టో పక్షాన పలుమార్లు విజ్ఞప్తులుచేయటం జరిగింది. ఇచ్చిన హామీలు మాత్రం నీటి మూటలైనాయి. **కావున క్రింది సమస్యల పరిష్కారానికై యీ నవంబర్ 20న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేయాలని ఏపిటియఫ్ రాష్ట్ర సబ్‌కమిటీ నిర్ణయించింది. ఈ ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.** ఉద్యమాలు, పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారాన్ని సాధించుకోగలం తప్ప కేవలం విజ్ఞప్తులు వినతులతోనే సమస్యలు పరిష్కారంకావని ఉపాధ్యాయులు గుర్తించి, ఈ ధర్నాను విజయవంతం చేయవలసినదిగా కోరుచున్నాము.

## పరిష్కారం చేయాల్సిన సమస్యలు

### 1.50% మధ్యంతర భృతి చెల్లించాలి :

జూన్ 30-2013తో 9వ పి.ఆర్.సి. గడువు ముగిసింది. 10వ పి.ఆర్.సిని జులై 1, 2013 నుంచి అమలుచేయాల్సి ఉన్నది. కాని వేతనసవరణ సంఘానికి మార్చి 2014వరకు గడువు ఉండడంతో, ఇప్పుడే నివేదిక అవకాశం కనబడటంలేదు. ఒకప్రక్క నిత్యావసర వస్తువుల ధరలుఆకాశాన్నంటుతున్నాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ధరాభారం అధికమవుతున్నది. కావున నివేదిక వచ్చేలోగా ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ధరల భారాన్ని తగ్గించేందుకు 50% మధ్యంతర భృతి 1-07-2013 నుంచి చెల్లించేవిధంగా మంజూరు చేయాలి.

### 2. హెల్త్‌కార్డు జి.ఓను సవరించాలి :

4 సంవత్సరాలుగా ఊరిస్తూ వస్తున్న ప్రభుత్వం ఎట్టకేలకు హెల్త్‌కార్డుల జి.ఓను జారీ చేసింది. కాని ఈ జి.ఓ. ఎయిడెడ్, మునిసిపల్ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు వర్తించదు. మునిసిపల్ ఉపాధ్యాయులు 010 ఖాతా ద్వారా ప్రభుత్వ కోశాగారం నుండే వేతనాలు పొందు తున్నవారికి కూడా వర్తించదు. కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రొవిన్షియ లైజేషన్ స్థానిక సంస్థల ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. దీనిని వెంటనే సవరించి ఎయిడెడ్, మునిసిపల్ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు హెల్త్‌కార్డుల సౌలభ్యాన్ని వర్తింపచేయాలి. అంతేకాక జి.ఓ. 174 ప్రకారం మెడికల్ రీఎంబర్స్ మెంట్ సౌకర్యాన్ని పొందుటకు, ప్యాకేజీలను సగానికి సగం తగ్గించి యిచ్చిన హెల్త్‌కార్డుల జి.ఓను కార్పోరేట్ హాస్పటల్స్ నాణ్యమైన వైద్యాన్ని అందించవు. కావున ఈప్యాకేజీ రేట్లను సవరించాలి, అవుట్ పేషెంట్ ట్రీట్‌మెంట్ మరికొన్ని ముఖ్యమైన వ్యాధులను జాబితాలో చేర్చాలి.

## 3. పండిట్, పి.ఇ.టి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలి :

ఉన్నత పాఠశాలలో స్టాఫ్ ప్యాటర్న్ ప్రకారం అన్ని పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయాలి. పండిట్, పి.ఇ.టి పోస్టులు మాత్రమే కేటగిరి 3లో ఉన్నాయి. కొన్ని పోస్టులను మాత్రమే అప్‌గ్రేడ్ చేయుటకు ప్రభుత్వం పూనుకొంటున్నది. అలాకాక ఉన్నత పాఠశాలల్లోని పండిట్, పి.ఇ.టి పోస్టులన్నింటినీ అప్‌గ్రేడ్ చేయాలి.

## 4. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి :

1984 నుండి 1991 వరకు, నెలకు రు. 398/- వేతనంపై స్పెషల్ టీచర్లను రిక్రూట్ చేసుకున్నారు. వారిని, ఖాళీలు వచ్చినపుడు రెగ్యులరైజ్ చేశారు. స్పెషల్ టీచర్‌గా పనిచేసిన కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని 5సంవత్సరాలుగా డిమాండు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు రాష్ట్రంలో స్పెషల్ టీచర్లుగా పనిచేసిన వారివివరాలను ప్రభుత్వం జిల్లా విద్యాశాఖాధికారులనుండి, తెప్పించుకొని నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నది. అంతేగాక వారికి 2 ఇంక్రిమెంట్లు యివ్వాల్సివస్తుందని లెక్కలువేసి ఆర్థికశాఖ అధికారులు అధిక భారం పడుతుందని తప్పుదారి పట్టిస్తుండటంతో, ఈ సమస్య అలాగే ఉంటున్నది. కాని చాలామందికి ఒక ఇంక్రిమెంటు మాత్రమే వస్తుంది. నెలకు రు. 398/- వేతనంపై వెట్టిచాకిరీ చేయించు కొని ఆ పీరియడ్‌కు నోషనల్‌గా ఇంక్రిమెంట్లు ఇవ్వటానికి కూడా ప్రభుత్వం వెనుకాడుతున్నది. ఈ డిమాండును వెంటనే పరిష్కరించాలి.

## 5. 1/2005, 37/2005 చట్టాలను ప్రాస్పెక్టివ్‌గా అమలు చేయాలి :

ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఏదైనా ఒక సౌలభ్యం కల్పిస్తే దానిని జి.ఓ. జారీ చేసిన తేదీనుండి, లేకపోతే ఆ తరువాత అమలుచేసే ప్రభుత్వం ఈ రెండు అంశాలపై మాత్రము వెనకనుండి అమలు అయ్యే విధంగా చట్టాలు చేసింది. ఈ రెండు చట్టాలను రద్దు చేయాలి. లేదా ప్రాస్పెక్టివ్‌గా అమలు చేయాలి. ప్రాస్పెక్టివ్‌గా అమలు చేయటం అంటే వారి వేతనం స్టెప్‌డౌన్ చేసి. జి.ఓ విడుదల చేసిన తేది నుండి రికవరీ చేస్తున్నారు. కాని చట్టంచేసిన తర్వాత నియమించిన వారికి మాత్రమే అమలయ్యే విధంగా చట్టాన్ని సవరించాలి.

## 6. అర్ధజీతపు సెలవును నగదుగా మార్చుకునే సౌలభ్యాన్ని ప్రభుత్వేతర ఉపాధ్యాయులకు వర్తింపచేయాలి:

పదవీరమణ చేసిన వారు మిగిలియున్న అర్థ జీతపు సెలవును నగదుగా మార్చుకునే సౌలభ్యం ఉన్నది. ఆ ఉత్తర్వులు పంచాయితీరాజ్, స్థానికసంస్థలఉపాధ్యాయులకువర్తించవంటూ పాఠశాలవిద్యాశాఖ వివరణ ఇచ్చింది. దానితో స్థానిక సంస్థల ఉపాధ్యాయులకు ఆ సౌకర్యం లేకుండా పోయింది. 1981లోని జిల్లా పరిషత్, మండల పరిషత్ ఉపాధ్యాయుల సర్వీసు ప్రొవిన్షియలైజ్ చేశారు. 2005 నుండి 010 ఖాతా ద్వారా జీతాలు చెల్లిస్తున్నారు. గతంలో మునిసిపల్ ఉపాధ్యాయులకు ఆ తర్వాత విజయవాడ, విశాఖ కార్పొరేషన్ ఉపాధ్యాయులకు 010 ఖాతా ద్వారా జీతాలు చెల్లిస్తున్నప్పటికీ వారెవరూ ప్రభుత్వ ఉద్యోగులు కాదని కొత్తగా వివరణ ఇవ్వడం అసంబద్ధం. ఇది ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం. అర్ధజీతపు సెలవు నగదుగా మార్చుకొనే సౌకర్యం స్థానికసంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులందరికీ వర్తింపచేయాలి.

## 7. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, నియామకాలు :

దాదాపు 12 సంవత్సరాలనుండి ఎయిడెడ్ పాఠశాలలలో పదోన్నతులు లేవు. పోస్టులు ఖాళీగా ఉండటంతో ఉపాధ్యాయులు క్రింది పోస్టులో ఉండి పై పోస్టులో పని చేయక తప్పటంలేదు. ఉపాధ్యాయ సంఘాలు జూన్ 11న చేసిన ధర్నా అనంతరం ఎయిడెడ్ పాఠశాలలలో పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరల ఇటీవల దానిని రద్దు చేశారు. వెంటనే ఆ జి.ఓ.ను పునరుద్ధరించి, ఎయిడెడ్ పాఠశాలలలో పదోన్నతులు కల్పించాలి,ఖాళీలను భర్తీచేయాలి.

## 8. అప్రయత్న పదోన్నతి పథకం - 50 సం. దాటినవారికి శాఖాపరమైన పరీక్షలనుండి మినహాయింపు :

అప్రయత్న పదోన్నతి పథకంలో ఎస్.పి.పి 2 స్కేలు శాఖాపర మైన పరీక్షలనుండి 50 సం. వయస్సుదాటినవారికి మినహాయింపునిస్తూ 9వ పి.ఆర్.సి జి.ఓ లలో పేర్కొన్నారు. కాని దానిపై తర్వాత ఆర్థిక శాఖ మినహాయింపులేదంటూ వివరణ ఇచ్చింది. పి.ఆర్.సి జి.ఓలలో ఉన్న దానిపై కేవలం మెమోద్వారావివరణఇస్తేచెల్లుబాటుకాదు. పి.ఆర్.సి ఇచ్చిన మినహాయింపును కొనసాగిస్తూ ఆర్థికశాఖ ఇచ్చిన వివరణను రద్దు చేయాలి.

## 9. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీచేయాలి :

రాష్ట్రంలో వేలాదిగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సబ్జక్టు టీచర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో బోధనాభ్యసన ప్రక్రియ కుంటు పడుతున్నది. కావున వెంటనే డి.యస్.సి.ని ప్రకటించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.

## 10. అశాస్త్రీయమైన 55జివోను రద్దుచేసి, స్టాఫ్ ప్యాటర్న్ నిబంధనలను పునరుద్ధరించాలి :

ఉన్నత పాఠశాలలో స్టాఫ్ ప్యాటర్న్ మరియు సెక్షన్‌కు 40 మంది విద్యార్థులు ఉండాలని నిబంధనలు ఉన్న జి.ఓను రద్దు చేసి. రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.ఎంఎస్.నెం.55ను తీసుకువచ్చింది. ఈ జి.ఓ ప్రకారం పాఠశాల విద్యార్థుల మొత్తం సంఖ్యను ఉపాధ్యాయుల సంఖ్యతో భాగించి సగటున 60 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ఉత్తర్వులను జారీచేసింది. ఇది అశాస్త్రీయం. సెక్షన్లకనుగుణంగా స్టాఫ్ ప్యాటర్న్ పోస్టుల మంజూరు ఉండాలి. కాని రెండు మీడియంలతో నడు స్తున్న పాఠశాలల్లో స్థూల సగటు పోస్టులను లెక్కించటం వలన ఉన్నత పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి. కావున జి.ఓ.నెం.55ను రద్దుచేసి పాతస్టాఫ్‌ప్యాటర్న్‌ను వెంటనే పునరుద్ధరించాలి.

## 11. ఐ.టి.డి.ఏ పాఠశాలలన్నిటిలో ఒకే విధానాన్ని అమలు చేయాలి :

ఐ.టి.డి.ఏ పాఠశాలల్లోని అన్ని ప్రాజెక్టులలో ఒకే విధానాలను అమలుచేయాలి: ఐ.టి.డి.ఏ పాఠశాలల్లో వార్డెన్ పోస్టులు మంజూరు చేయాలి.ఐ.టి.డి.ఏ పాఠశాలల్లో సెక్షన్స్‌కి అనుగుణంగా పోస్టులు మంజూరుచేసి, భర్తీచేయాలి.

ఉద్యమ బాటలోనే డిమాండ్లను సాధించుకోవలసి ఉంటుం దనేది చరిత్ర నేర్పుతున్న పాఠం.

కావున పై డిమాండ్ల సాధనకు ఏపిటియఫ్ ఆధ్వర్యాన **20-11-2013న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరుగు ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.**

విజయవాడ ఉద్యమ అభినందనలతో,

6-11-2013 **ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్**